క్లుప్తంగా

ఆలయ ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అర్చకుడు, ఆలయ కమిటీసభ్యులు

నర్సాపూర్: మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో వెలిసిన సీతరామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని చేపట్టే ఉత్సవాల వాల్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. స్థానిక బస్టాండ్ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు హరిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా హరిప్రసాద్‌శర్మ మాట్లాడుతూ.. 30న సీతరామచంద్రస్వామి కల్యాణోత్సవం, 31న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, పల్లకిసేవ, ఏప్రిల్ 1న శ్రీరామహవనం, శ్రీచండీ సప్తశతి హవనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో హరిప్రసాద్‌శర్మ, వాల్‌పోస్టర్ ముద్రణ దాత నరేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు సంజీవ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డు విరిగినా పట్టదా..?



నర్సాపూర్ పట్టణ శివారులో పాడైన సూచిక బోర్డు

నర్సాపూర్: జాతీయ రహదారిపై సూచిక బోర్డు విరిగింది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారిపై పట్టణ శివారులో అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు పాడవడంతో పాటు విరిగి ఒక పక్కకు ఒరిగింది. జాతీయ రహదారిపై ముందు వచ్చే గ్రామాల పేర్లు, దూరం తెలిపే సూచిక బోర్డు పాడైనా జాతీయ రహదారి అథారిటీ అధికారులు మరమ్మతులు చేయించనందున ప్రజల నుంచి నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా సూచికబోర్డుకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది.

గొల్లకురుమలకు డోలు బహూకరణ



డోలు అందిస్తున్న సుధీర్, ఇర్ఫాన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గంగారం గ్రామంలోని గొల్ల కురుమలకు బుధవారం ఉపసర్పంచ్ సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు ఇర్ఫాన్‌లు డోళ్లు బహూకరించారు. కార్యక్రమంలో గ్రామంలోని గొల్ల కురుమలు పాల్గొన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠోత్సవం



పూజల్లో సీఎంఓ కార్యదర్శి నర్సింగరావు దంపతులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం కనుల పండువగా ప్రారంభమైంది. ఆలయ నిర్మాణ దాత దశరథ్‌రెడ్డి చేపట్టగా, ప్రతిష్ఠ సందర్భంగా మొదటిరోజు వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, ప్రతిష్ఠా మహాసంకల్పం, ఆచార్య, బుత్విక్‌వరణం, గోపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 30 వరకు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పూజలు నిర్వహిస్తామని ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, రాధకిషన్, దేవిశ్రీ, సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ప్రతిష్ఠలో సీఎంఓ కార్యదర్శి

ప్రతిష్ఠ పూజ మహోత్సవంలో సీఎం కార్యాలయ ప్రధాన కార్యదర్శి నర్సింగరావు దంపతులు పాల్గొన్నారు. పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ దశరథ్, బీఆర్‌ఎస్ నాయకులు నారయణరావు, దర్శన్‌రావు, హర్జనాయక్, వీరస్వామి, పాపయ్యచారి తదితరులు ఉన్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): కూచారం హనుమాన్ దేవాయలంలో..



కొడిపల్లి(నర్సాపూర్): ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చిన్నశంకరంపేట(మెదక్): అనంత పద్మనాభస్వామి గుట్ట వద్ద..



చిలప్‌చెడ్(నర్సాపూర్): గౌతాపూర్ హనుమాన్ ఆలయంలో..



చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ..

వైభవంగా ఉగాది పండగ

జిల్లా వ్యాప్తంగా బుధవారం అన్ని గ్రామాల్లో ఉగాది పండగ ఘనంగా నిర్వహించారు. అలాగే పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాల వద్ద, గ్రామ పంచాయతీల వద్ద వేదపండితుల ద్వారా ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగాన్ని పఠించారు. ఈ సంవత్సరం స్థితిగతుల గూర్చి తెలిపారు.



కొడిపల్లి(నర్సాపూర్): పంచాంగ శ్రవణం వింటున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో..



పెద్దశంకరంపేట(మెదక్): రామాలయంలో..



టేక్మాల్(మెదక్): కుసంగి హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నర్సాపూర్: పంచాంగ శ్రవణం వింటున్న మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, ఆయా పార్టీల నాయకులు



మనోహరాబాద్(తూప్రాన్): హనుమాన్ దేవాలయంలో పంచాంగం వింటున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కప్‌తో విజేత టీం, నిర్వాహకులు



వెల్మకన్నలో టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నవీన్‌గుప్తా

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్‌లో దివంగత నరేష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతగా దేవులపల్లి క్రికెట్ టీం నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఫైనల్ మ్యాచ్‌లో దేవులపల్లి, అన్నారం టీంలో పోటీపడగా దేవులపల్లి గ్రామ క్రికెట్ టీం సభ్యులు విన్నర్‌గా నిలవడంతో రూ. 20వేలు నగదు, కప్ అందజేశారు. రన్నర్ టీం అన్నారంకు రూ. 10వేలు నగదుతో పాటు కప్ బహూకరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జగన్, నాయకులు సంతోష్‌గౌడ్, తిరుపతిరెడ్డి, మల్లేశం, శ్రీనివాస్, రాజు, రాజాగౌడ్, సత్తయ్య, శివరాజ్, శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌గౌడ్, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న దివంగత సర్పంచ్ వడ్ల శ్రీనివాస్ స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, సర్పంచ్ కాజీపేట రాజేందర్ ప్రారంభించారు. దివంగత సర్పచ్ జ్ఞాపకార్థం మూడు రోజుల పాటు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమలో గ్రామస్తులు లక్ష్మణ్, వెంకట్రాములు, రమణ, బాలింగం యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధ్వానంగా కార్యాలయ పర్యవేక్షణ



అల్లాదుర్గం ఈజీఎస్ కార్యాలయం

మరుగుదొడ్లు శుభ్రం చేయకపోవడంతో అవస్థలు

అల్లాదుర్గం(మెదక్): పరిశుభ్రతతోనే వ్యాధులు దరి చేరవని నిత్యం అధికారులు చెబుతున్నారు. ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటించాలని, ప్రతీ ఇంట్లో మరుగుదొడ్లు కట్టుకోవాలని స్వచ్ఛ భారత్ పథకం కింద ఉపాధి హామీ అధికారులు ప్రచారం చేశారు. అదే కార్యాలయం ఇప్పుడు కంపుకొడుతుంది. కార్యాలయంలో కూర్చోవాలన్న, పనులపై వెళ్లిన వారు ముక్కు మూసుకుంటున్నారు. ఇది అల్లాదుర్గం ఈజీఎస్ కార్యాలయం దుస్థితి.

అల్లాదుర్గం ఈజీఎస్ కార్యాలయానికి వెళ్లితే మరుగుదొడ్ల వాసనతో ప్రజలు ముక్కు ముసుకుంటున్నారు. ఐకేపీ, ఈజీఎస్ కార్యాలయాలకు ఒకే భవనం ఉంది. పై అంతస్తులో ఉపాధిహామీ కార్యాలయం కొనసాగుతోంది. సిబ్బంది విధులు నిర్వహించే గదులకు ఎదురుగానే మరుగుదొడ్లు ఉన్నాయి. కానీ వాటిని ఉపయోగిస్తున్నారో తప్ప.. సరిగా నిర్వహణ చేయ్యట్లేదు. ఆ కార్యాలయానికి ఉపాధి కూలీలు, సర్పంచ్‌లు, పలు పనులపై కార్యాలయానికి వస్తారు. కంపుకొడుతున్న కార్యాలయంలో ఉండలేక బయటకు పరుగులు పెట్టాల్సి వస్తుందని పలువురు చెప్పారు. ఇతరులకు స్వచ్ఛభారత్, పరిశుభ్రతపై ఇదే కార్యాలయ సిబ్బంది అవగాహన, సూచనలు ఇచ్చారు. కానీ అదే అధికారులకు వారి కార్యాలయంలో కంపుమాత్రం కనిపించడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి కార్యాలయంలోని మూత్రశాలలను శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై సిబ్బందిని ప్రశ్నిస్తే మరుగుదొడ్లు కడగకపోవడంతో వాసన వస్తుందని చెప్పాడం గమనార్హం.

ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని బందారంలో ముదిరాజ్ కులసంఘం ఎన్నికలు బుధవారం ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షుడిగా నీల వెంకటేశ్, కోశాధికారిగా గుర్రాల రామస్వామి, ఉపాధ్యక్షుడిగా రాగుల నర్సింలు ఎన్నికయ్యారు. అనంతరం ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు జక్కుల అరుణాకర్, ఉపాధ్యక్షుడిగా నీల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నీలమల్లేశం, కోశాధికారిగా జాప శ్రీనివాస్, సలహాదారులు రాగుల దుర్గయ్య, నీల నారాయణ, నీల కిష్టయ్య, నీల ఆంజనేయులు, రాగుల మల్లేశం, జనగామ కనుకయ్య, నీల యాదగిరి, నీల హరీశ్, నీల వెంకటేశంలు ఎన్నికయ్యారు.

గ్రామ దేవతల ఉత్సవాలు



కొల్చారం(నర్సాపూర్): బండ్ల ఊరేగిస్తున్న భక్తులు



చేగుంట(తూప్రాన్): బోనాలు ఊరేగిస్తున్న మహిళలు



చేగుంట(తూప్రాన్): రాంపూర్‌లో..



చేగుంట(తూప్రాన్): వడియారంలో..



కొల్చారం(నర్సాపూర్): వరిగుంతంలో..



కొడిపల్లి(నర్సాపూర్): వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బండ్ల ఊరేగింపు



కొడిపల్లి(నర్సాపూర్): కూకుట్లపల్లిలో ..

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీరాయిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం, కూకుట్లపల్లిలో బట్టమ్మదేవితో పాటు గ్రామదేవతల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉగాది పండగ సందర్భంగా అమ్మవారికి భక్తులు బండ్లు, బోనాలను ఊరేగించి, మొక్కులు తీర్చుకున్నారు. కూకుట్లపల్లిలో గుమ్మటాల బండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దేవతామూర్తులకు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సుజాత కాంతారావ్, కాజీపేట రాజేందర్, నాయకులు రఘువీరారెడ్డి, రామాగౌడ్, బట్టయ్య, వెంకన్న, శ్యాంసుదర్‌రావు, లింగం పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ముత్యాలమ్మ అమ్మవారికి బుధవారం ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, సామూహిక పుణ్యాహవచనం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ట్రాక్టర్‌పై మగ్గం ఏర్పాటు చేసి స్వయంగా చేనేతతో తయారు చేసిన చీరతో పాటు మహిళలు అమ్మవారికి బోనాలు ఊరేగించి, సమర్పించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమల నర్సింలు, ఉపసర్పంచ్ గిరి, పద్మశాలీ సంఘం నాయకులు సూర్యప్రకాశ్, శ్రీనివాస్, మురళి, సత్యనారాయణ, అశోక్, సత్యం, పెంటయ్య, శ్రవణ్, సిద్ధిరాములు, పెంటయ్య, బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలలోని రంగంపేట మధనానంద స్వామి ఆశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద స్వామి ఆధ్వర్యంలో నూతన ఏడాది రాశి ఫలాలపై పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. సాయంత్రం గ్రామ దేవతలకు అందంగా అలంకరించిన ఎడ్ల బండ్లను ఊరేగించారు.

కనులపండువగా నల్ల పోచమ్మ జాతర



పెద్దశంకరంపేటలో బండ్లు ఊరేగిస్తున్న గ్రామస్తులు



రామాయంపేట(మెదక్): అక్కన్నపేటలో బండ్లను ఊరేగిస్తున్న దృశ్యం

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామంలో బుధవారం నల్లపోచమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయం చుట్టూ బండ్లను ఊరేగించారు.

దుర్గామాత ఆలయంలో..

పెద్దశంకరంపేట(మెదక్): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దశంకరంపేటలోని దుర్గాభవాని జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. దుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం సాయంత్రం ఎడ్లబండ్లను ఊరేగించారు. దుర్గమ్మ ఆలయంతో పాటు కోటమ్మ, గంగమ్మ ఆలయాల చుట్టూ మూడు ప్రదక్షిణలు, అనంతరం పోచమ్మగుడి కొండలరాయడి చుట్టూ బండ్లను ఊరేగించారు. మండల పరిధిలోని బద్దారం, మల్కాపురం, చీలపల్లి, ఉత్తులూరు, శివాయపల్లి, మార్చేపల్లి, జూకర్ గ్రామాల్లో ఆలయాల చుట్టూ ఎడ్లబండ్లను ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పాపన్నపేట(మెదక్): మండలంలోని పలు గ్రామాల్లో జాతరలు జరిగాయి. నార్సింగి, మల్లంపేట, కొడుపాక, యూసుఫ్‌పేట, కుర్తివాడ, నామాపూర్, రామతీర్థం తదితర గ్రామాల్లో బండ్లను ఊరేగించారు.

రేగోడ్(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సాయంత్రం ఆలయాల వద్ద వేదపండితులు పంచాంగ పఠనాన్ని చదివి వినిపించారు.